క్లుప్తంగా


ఘనంగా శ్రవణ నక్షత్ర హోమం



హోమం నిర్వహిస్తున్నఅర్చకులు

సింహాచలం: శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం అనుబంధ దేవాలయం కొండ దిగువ వేంకటేశ్వరస్వామి ఆలయంలో హోమాన్ని విశేషంగా నిర్వహించారు. సుదర్శన పెరుమాళ్‌ను ఆలయ ప్రాంగణంలోని మండపంలో కొలువుంచారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, మండపారాధన, అగ్ని ప్రతిష్ఠ, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు. స్వామికి విశేష హారతులు అందించారు.

ఆదిత్యునికి అభిషేకాలు



పూజలందుకున్న సూర్యనారాయణస్వామి

పెందుర్తి: సుజాత నగర్‌లోని సూర్య నారాయణస్వామి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. వేకువ జామున స్వామి వారికి పంచ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు చేశారు. అలంకరణ చేసి ప్రత్యేక పూజలు జరిపారు. ఆదిత్యునికి పంచ హారతి, నక్షత్ర హారతి ఇచ్చారు. ఆలయ ధర్మకర్త చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకేషనల్ ఫిజియోథెరపీలో అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పెనుమత్స శిరీషరాణి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. బీపీటీలో 55 శాతం మార్కులు, అనుభవం కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 15 మధ్యాహ్నం 3 గంటల్లోపు కళాశాలలో సంప్రదించాల్సిందిగా కోరారు.

ఇంటింటా ప్రచారం

పరవాడ: మండలంలో రావాడ, కలపాక గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో నియోజక వర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గండి బాబ్జీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పరవాడ మాజీ జెడ్పీటీసీ పైల జగన్నాథరావు, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు వియ్యపు చిన్న, నాయకులు కన్నూరి వెంకటరమణ, ఇందల కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లపై నిరంతర నిఘా



కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సతీష్‌కుమార్

పెందుర్తి: సర్కిల్ పరిధిలోని రౌడీ షీటర్లపై నిరంతర నిఘా ఉంచుతున్నామని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సతీష్‌కుమార్ అన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే జైలుపాలు కావాల్సి వస్తుందని రౌడీ షీటర్లను హెచ్చరించారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు నగర పోలీస్ కమిషనర్, ఇతర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ చెడు ప్రవర్తన వలన తమ కుటుంబాలు సమాజంలో నిరాదరణకు గురవుతాయని గుర్తుంచుకోవాలన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినట్లు పోలీసుల దృష్టికి వస్తే పీడీ యాక్ట్ ప్రయోగించడానికి వెనుకాడబోమని స్పష్టం చేశారు. మంచి నడవడికతో ఉంటే రౌడీషీట్‌లు ఎత్తివేయడానికి ఉన్నతాధికారులు ఆలోచన చేస్తారని తెలిపారు. పలు సూచనలు చేశారు. ఎస్‌ఐలు స్వామినాయుడు, ఎన్వీ భాస్కరరావు, ఏఎస్‌ఐ కాశీప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

సండే.. తీరంలో సందడి



పరవాడ : ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం సముద్ర తీర ప్రాంతాలు సందర్శకులతో ఆదివారం సందడిగా మారాయి. అనకాపల్లి, తోటాడ, వెంకటాపురం, లంకెలపాలెం, అగనంపూడి, స్టీల్‌ప్లాంట్, పరవాడ, దీపాంజలినగర్, వాడచీపురుపల్లి తదితర సుదూర ప్రాంతాల నుంచి సందర్శకులు పిల్లాపాపలతో తీర ప్రాంతాలకు తరలివచ్చారు. తీరంలో క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ వంటి ఆటలతో సరదాగా గడిపారు. సాయంత్రం సముద్రంలో జలకాలాడారు. చీకటి పడుతున్న సమయంలో ఇళ్లకు తిరుగుముఖంపట్టారు.

అధ్వానంగా పరవాడ మండల గ్రామీణ రోడ్లు

అడుగుకో గొయ్యి.. గజానికో గుంత

తాత్కాలిక మరమ్మతులకూ నోచని వైనం

గుంతల్లేని రోడ్లు.. అమలుకాని కూటమి హామీ!

ఈ రోడ్లు.. నరకానికి నకళ్లు!

మండలంలో అధ్వానంగా మారిన గ్రామీణ రోడ్లకు మరమ్మతులు చేపట్టక పల్లె ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. ఏ రోడ్డు చూసినా మోకాలి లోతు గోతులు, ఎక్కడికక్కడ పైకి లేచిన కంకర, రాళ్లు. అధికారంలోకి రాగానే రోడ్లను అద్దంలా తీర్చిదిద్దుతామని, సంక్రాంతికి గోతుల్లేని రోడ్లని గొప్పలు పోయిన.. కూటమి నేతల మాటలు నీటి మీద రాతలయ్యాయి. సంక్రాంతి పోయి ఆరుమాసాలవుతున్నా.. రోడ్లకు కనీసం తాత్కాలిక మరమ్మతులు కూడా చేపట్టలేదని ప్రజలు ఆక్షేపిస్తున్నారు.

– పరవాడ



గోతులతో నిండిన పరవాడ-ఫార్మాసిటీ రోడ్డు



బురదమయంగా మారిన ఎన్టీపీసీ-బొట్టవానిపాలెం రోడ్డు

తాత్కాలిక మరమ్మతులకు నిరీక్షణ



గుంతలతో నిండిన మెట్టపాలెం-పాతరాజన్నపాలెం రోడ్డు

నాయుడుపాలెం శివారు మెట్టపాలెం-పాతరాజన్నపాలెం రహదారి దశాబ్ద కాలంగా అభివృద్ధికి నోచుకోలేదు. అడుగుకో గుంతతో ప్రయాణికుల పాలిట నరకంగా మారింది. రైతులు పండించిన పంటలను పట్టణ ప్రాంతాలకు తరలించేందుకు ఇదే ప్రధాన మార్గం. కనీసం తాత్కాలిక మరమ్మతులైనా చేపట్టాలని ప్రజలు పదేపదే అధికారులను, పాలకులను కోరుతున్నారు.

గోతులనైనా పూడ్చండి!



పాడైన ఎన్టీపీసీ-వెన్నలపాలెం రహదారి

రెండు కిలోమీటర్ల నిడివి కలిగిన ఎన్టీపీసీ-వెన్నలపాలెం రహదారి దుస్థితి గురించి ఎంత చెప్పినా తక్కువే. పలు చోట్ల భారీ గుంతలు ప్రయాణికులను భయపెడుతున్నాయి. ఊట గెడ్డ కాలువ వంతెనపై ఏమాత్రం వర్షం పడినా నిలిచిన నీటితో వాహనచోదకులు నానా పాట్లు పడుతున్నారు. కనీసం రహదారిలో గోతులనైనా పూడ్చండి మహాప్రభో అని మొరపెట్టుకుంటున్నా పట్టించుకునే నాథులు లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డేదో.. గొయ్యేదో..



రాళ్లు తేలిన వాడచీపురుపల్లి-నునపర్తి రోడ్డు

ఐదారు గ్రామాల ప్రజల రాకపోకలకు ప్రధాన మార్గంగా ఉన్న వాడచీపురుపల్లి-నునపర్తి గ్రామాల మధ్య ఏర్పాటు చేసిన రహదారి పదేళ్లుగా మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో రావాడ, ధర్మారాయుడుపేట, రేకవానిపాలెం, నునపర్తి, వెంకటాపురం ప్రజలు నరకయాతన పడుతున్నారు. రోడ్డు పొడవునా భారీ గుంతలు, పెచ్చులూడి, రాళ్లు తేలిపోయి కనీసం నడచేందుకూ వీల్లేని పరిస్థితి. ఏ మాత్రం వర్షం పడినా గోతుల్లో నీరు చేరి, రాత్రుళ్లు రోడ్డేదో.. గొయ్యేదో తెలియక ప్రమాదాలకు గురవుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు.

ప్రమాదాలతో సావాసం



ధ్వంసమైన లంకెలపాలెం-అసకపల్లి రహదారి

లంకెలపాలెం-అసకపల్లి రోడ్డు మరింత దారుణంగా ఉంది. నిత్యం వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్న బూడిద, బొగ్గు లారీలతో అధ్వానంగా తయారైంది. మోకాలి లోతు గోతులతో ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. పాడి వాతావరణంలో ఎగసిపడుతున్న దుమ్ముధూళితో ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల పెదముషిడివాడ వద్ద జరిగిన ప్రమాదంలో 17 ఏళ్ల యువకుడు దుమ్ముధూళిలో ఎదురుగా వస్తున్న లారీని గుర్తించక దుర్మరణం చెందాడు. రోడ్డు అభివృద్ధికి కూటమి ఎమ్మెల్యే పంచకర్ల ఇచ్చిన హామీ నేటికి అమలు కాలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- పరవాడ-లంకెలపాలెం రోడ్డులో ఇండ్రస్టియల్ పార్క్ వద్ద రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో ఉద్యోగులు, కార్మికులు, సాధారణ ప్రజలు అవస్థలు పడుతున్నారు. రాత్రి సమయంలో ఈ ప్రదేశంలో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.
- ఎన్టీపీసీ-బొట్టవానిపాలెం గ్రామాల మధ్య 20 ఏళ్ల క్రితం నిర్మించిన మెటల్ రోడ్డుకు నేటికీ మోక్షం లభించలేదు. చిన్నపాటి వర్షం పడితే చాలు రోడ్డంతా బురదమయంగా మారుతోంది. రోడ్డుకు ఇరువైపులా దట్టంగా పెరిగిన తుప్పలు, డొంకలతో రాకపోకలు సాగించడం కష్టంగా మారుతోందని ప్రజలు వాపోతున్నారు.
- పెదముషిడివాడ-మంత్రిపాలెం, వెన్నలపాలెం-సోమునాయుడుపాలెం, మూలస్వయంభూవరం రహదారులు రాళ్లు తేలిపోయి మరమ్మతుల కోసం ఎదురు చూస్తున్నప్పటికీ అధికారులు కనీస చర్యలకూ చొరవ చూపట్లేదు.

నరకం చూస్తున్నాం



ఏళ్ల తరబడి మరమ్మతులతో మూల్గుతున్న మెట్టపాలెం రోడ్డుతో నరకం చూస్తున్నాం. రోడ్డు పొడవునా గోతులే. రహదారిలో కనీసం వీధి దీపాలు కూడా లేవు. చీకటి పడితే అంధకారంలో రాకపోకలకు భయంగా ఉంది. అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం కనిపించట్లేదు.

– కన్నూరి తాతాబాబు, మెట్టపాలెం

మరమ్మతులు చేపట్టాలి



అధ్వానంగా మారిన ఎన్టీపీసీ-వెన్నలపాలెం రోడ్డులో గుంతలను పూడ్చకపోవంతో ఉద్యోగులు, కార్మికులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. రహదారిలో వంతెనపై నిలిచిపోతున్న వర్షం నీటితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. తక్షణమే మరమ్మతులు చేపట్టాలి.

– వెన్నల నాయుడు, వెన్నలపాలెం

ప్రయాణం కత్తి మీద సాము



లంకెలపాలెం-అసకపల్లి రోడ్డులో ప్రయాణం కత్తి మీద సామే. గోతుల రహదారిలో భారీ వాహనాల ద్వారా ఎగసిపడుతున్న బూడిద వల్ల ప్రయాణికుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. ఇటీవల పెదముషిడివాడ ప్రమాదంలో యువకుడి మృతి ఘటనే నిదర్శనం.

– కలవలపల్లి సత్యనారాయణ, పెదముషిడివాడ

వానలు కురవాలని కప్పల పండగ



కప్పల జంటను ఊరేగిస్తున్న పిల్లలు

సబ్బవరం: మండలంలోని గొర్లివానిపాలెంలో ఆదివారం వరుణ దేవుని కటాక్షం కోసం కప్పల పండగ ఘనంగా నిర్వహించారు. యూత్ కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలోని పలువురు యువకులు ఆడా, మగ కప్పల జంటను మేళతాళాలతో వీధుల్లో ఊరేగించారు. కావడి ఊరేగింపుగా తీసుకెళ్లి కప్పల జంటకు మహిళలు, పెద్దలు జలాభిషేకం తర్వాత పెళ్లి చేశారు. యువత ఇంటింటికీ వెళ్లి జోగి దండారు. దాంతో ప్రసాదం తయారుచేసి సూదికొండపై వరుణ దేవుడికి నైవేద్యం సమర్పించి, అనంతరం భక్తులకు పంచిపెట్టారు. ఈ కప్పల పండగ పూర్వీకుల నుంచి సాంప్రదాయంగా నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువత గండి దేముడు, గొర్లి కృష్ణ, రామకృష్ణ, గొంప వినోద్, అప్పలనాయుడు, నాగేంద్ర, సత్తిబాబు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తిప్పికొట్టండి



జ్యోతినగర్‌లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

- సీపీఎం ఆధ్వర్యంలో నిరసన పాదయాత్ర

పెందుర్తి: ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన కూటమి ప్రభుత్వ పెద్దలు.. అధికారంలోకి వచ్చాక స్మార్ట్ మీటర్లు అమర్చేందుకు సిద్ధం కావడం సిగ్గుచేటని సీపీఎం నాయకురాలు బి.అనంతలక్ష్మి మండిపడ్డారు. ప్రజలంతా కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి సిద్ధమైన స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. 'అదానీ స్మార్ట్ మీటర్లు వద్దు–పెంచిన విద్యుత్ చార్జీల రద్దు' నినాదంతో జీవీఎంసీ 94, 95వ వార్డుల్లో జ్యోతినగర్, అప్పలనర్సయ్యకాలనీల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా అనంతలక్ష్మి మాట్లాడుతూ ప్రజలు ప్రస్తుతం తాము వినియోగించిన విద్యుత్‌కు మాత్రమే బిల్లులు కడుతున్నారని, అదే స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే వినియోగదారులకు తీవ్ర భారమవుతుందన్నారు. బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వం ప్రజలను వంచిస్తూ అదానీ విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తోందని ధ్వజమెత్తారు. ఒక్కో మీటర్‌కు కేటగిరీలను బట్టి రూ.8,927, రూ.17,286 వసూలు చేయాలని నిర్ణయించడం దారుణమన్నారు. పైగా గతంలో బిల్లుల చెల్లింపునకు కనీసం 15 రోజుల గడువు ఉండేదని, కానీ స్మార్ట్ మీటర్ల పుణ్యమా అని ముందుగానే విద్యుత్‌కు రీచార్జ్ చేసుకునే దుస్థితి వస్తుందని ఆక్షేపించారు. పొరపాటున రీచార్జి చేసుకోకపోతే ప్రజలు చీకట్లో బతకాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. ఈ క్రమంలో విద్యుత్ చార్జీల ప్రక్రియ ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లి, సామాన్యులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గతంలో మాట్లాడిన మాటలు గుర్తు తెచ్చుకుని స్మార్ట్ మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలని సూచించారు. లేకపోతే పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమం ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బి.రమణి, జక్కాన సత్యనారాయణ, మధు, జయలక్ష్మి, చిన్నమ్మలు, అర్జున్, వెంకటలక్ష్మి, ఈశ్వరమ్మ, మంగ, తదితరులు పాల్గొన్నారు.

తాళాలు వేసిన ఇంట్లో చోరీ

- 4 తులాల బంగారు, 20 తులాల వెండి వస్తువుల అపహరణ



బాధితురాలి నుంచి వివరాలు సేకరిస్తున్న సీఐ మల్లికార్జునరావు, క్లూస్ టీం

పరవాడ: లంకెలపాలెం శివారు శ్రీరామనగర్ కాలనీకి చెందిన డొంకాడ విమలకుమారి ఇంట్లో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బీరువాలో భద్రపర్చిన నాలుగు తులాల బంగారు ఆభరణాలు, 20 తులాల వెండి వస్తువులు చోరీకి గురైనట్లు పరవాడ పోలీస్ స్టేషన్‌లో బాధితురాలు ఆదివారం ఫిర్యాదు చేశారు. పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపిన వివరాలు.

విమల కుమారి శనివారం ఉదయం ఇంటి తలుపులు వేసి, తన పెద్ద కుమారుడి ఇంటికి వెళ్లింది. ఆదివారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా తలుపులు తెరచి ఉండటంతోపాటు, ఇంట్లో వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువా తాళాలు విరగ్గొట్టి లోపల భద్రపర్చిన బంగారు, వెండి ఆభరణాలను దోచుకుపోయినట్లు బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఘటనా స్థలిని డీఎస్పీ వి.విష్ణుస్వరూప్, సీఐ మల్లికార్జునరావులు పరిశీలించారు. క్లూస్ టీం రంగంలోకి దిగి వేలిముద్రలను సేకరించారు. ఎస్‌ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నారు.

విద్యా వికాస కేంద్రాల నిర్వాహకులకు శిక్షణ



శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న గొర్లె రామునాయుడు

పెందుర్తి: స్థానిక కైట్స్ స్కిల్స్, ఏకలవ్య ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం సారథ్యంలో నిర్వహిస్తున్న విద్యా వికాస కేంద్రాల నిర్వాహకులకు శిక్షణ తరగతులను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కైట్స్ అధినేత గొర్లె రామునాయుడు మాట్లాడుతూ జిల్లాలోని 30 గ్రామాల్లో ఉన్న విద్యా వికాస కేంద్రాల నిర్వాహకులకు ఇక్కడ శిక్షణ అందిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పలు అంశాలపై నిర్వాహకులు సూచనలు, సలహాలు అందించారు. ఉపాధ్యాయురాలు శేషమాంబ, ప్రాజెక్ట్ మేనేజర్ ప్రశాంత్, జిల్లా కో ఆర్డినేటర్లు వనజ, గౌరీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై కేసుల నమోదు

పెందుర్తి: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధి మేహాద్రి గెడ్డ రిజర్వాయర్, నరవ, సతివానిపాలెం, వేపగుంట, పెందుర్తి ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న పలువురిపై పోలీసులు ఆదివారం కేసులు నమోదు చేశారు.

బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం, మద్యపానంతో పాటు శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారన్న సమాచారంతో పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో అనేక ప్రాంతాల్లో సీఐ కె.వి.సతీష్‌కుమార్ నేతృత్వంలో పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. డ్రోన్ చిత్రాల ఆధారంగా నిందితులను గుర్తించారు. 15 మందిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించడంతో పాటు బహిరంగంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



కంకణధారణ ఘట్టంలో అర్చకుడు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన జరిపారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శత నామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుంచి, ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం శేషవస్త్రాలను అందజేశారు.

ఘనంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం గరుడసేవ విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని గరుడవాహనంపై వేంజేపచేశారు. అష్టోత్తర శతనామావళి పూజ జరిపారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు.

గోరింటాకు విశిష్టతపై అవగాహన

పరవాడ: గోరింటాకు పెట్టుకోవడం ద్వారా కొన్ని అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చని సమరసత సేవా ఫౌండేషన్ మహిళా విభాగం మండల కన్వీనర్ పెదపాటి కృష్ణవేణి తెలిపారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఫౌండేషన్ ప్రతినిధులు అచ్యుతాపురం వికలాంగుల ఆశ్రమంలో గోరింటాకు విశిష్టతపై అవగాహన సదస్సును ఆదివారం నిర్వహించారు. పిల్లలకు గోరింటాకు పెట్టడం వలన వైరస్, క్రిమికీటకాలు దరి చేరవన్నారు. కార్యక్రమంలో భాగంగా గోరింటాకు విశిష్టతపై పిల్లలకు అవగాహన కల్పించారు. పిల్లలందరి చేతులకు గోరింటాకు పెట్టి వారితో మాటామంతీ కలిపారు. కార్యక్రమంలో వికలాంగుల పాఠశాల కరస్పాండెంట్ పి.ఎస్.టి.పట్నాయక్, ఇన్‌చార్జి హెచ్‌ఎం పాలిపిల్లి శ్రీను, ఫౌండేషన్ ప్రతినిధులు బొద్దపు నూకరత్నం, పూర్ణ, కింతాడ వరలక్ష్మి పాల్గొన్నారు.

గోరింటాకు పెట్టుకున్న చేతుల్ని చూపుతున్న వికలాంగ చిన్నారులు



అ'పూర్వ' కలయిక



చింతలగ్రహారం జెడ్పీ హైస్కూల్ 1997-98 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

పెందుర్తి: దాదాపు రెండున్నర దశాబ్దాల తర్వాత వారంతా కలుసుకున్నారు. ఆడీపాడీ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. సరదాగా కబుర్లు చెప్పుకున్నారు. సహపంక్తి భోజనాలు చేశారు. చింతలగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1997–98 బ్యాచ్ పదోతరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పాఠశాల ఆవరణలో ఆదివారం జరిగింది. ఒకరిని ఒకరు పరస్పరం పరిచయం చేసుకుని, చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పూర్వ ఉపాధ్యాయులు కె.వి.అప్పారావు, జగన్నాథం, శ్రీనివాస్‌లను సత్కరించి ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. సాయంత్రం వరకు సందడిగా గడిపి, చక్కటి జ్ఞాపకాలతో వీడ్కోలు తీసుకున్నారు.